



శ్రీశైలంలో గుమ్మడి కాయలతో సాత్విక బలి



శ్రీశైలంలో అశేష జనం మధ్య స్వామి అమ్మవార్ల రథోత్సవం





బ్రహ్మోత్సవ రథంపై మల్లన్న

- అశేషంగా తరలి వచ్చిన భక్తులు
- శివ నామ స్మరణతో మార్మోగిన శ్రీగిరి
- పుష్కరిణిలో ఉత్సవమూర్తులకు తెప్పోత్సవం

శ్రీశైలం, మార్చి 9: శ్రీగిరిపై బ్రహ్మోత్సవ రథాన్ని అధిరోహించిన మల్లికార్జునుడు భ్రమరాంబ సమేతుడై అశేష భక్తజనం కోలాహలం నడుమ ఊరేగాడు. సాయంత్రం రథశాల వద్ద ఆలయ అర్చకులు రథానికి రథాంగ పూజ, రథాంగ హోమం, రథాంగబలి కార్యక్రమాలు శాస్త్రబద్ధంగా నిర్వహించారు. తదుపరి ఉభయ దేవాలయ ప్రాంగణంలో విశేష అర్చనలు, హారతులు అందుకున్న స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో రాజగోపురం మీదుగా రథశాల వద్దకు మేళతాళాలు, భజంత్రీల నడుమ తోడ్కొని వచ్చారు. పుష్ప ప్రియుడైన మల్లయ్యకు సుగంధ పుష్పాలు, పరిమళ ద్రవ్యాలతో అలకంరించిన రథంపై అధిష్ఠింపజేసి సాత్విక బలిగా కొబ్బరి కాయలు, గుమ్మడికాయలను సమర్పించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం దాకా, అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం వరకు రథోత్సవం సాగింది. రథం ముందు కోలాటం, చెక్కభజన, కేరళ కథాకళి, గొరవయ్యల నృత్యం, తప్పెటచిందు, కర్నాటక జాంజ్, వీరగాసి, కొమ్మువాయిద్యం, నందికోలు సేవ, కంచుడోలు, బుట్ట బొమ్మలు, బీరప్పడోలు, పగటి వేషధారణ ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

● వైభవంగా తెప్పోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. కార్యక్రమంలో ముందుగా ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పాలంకృత పల్లకీలో ఊరేగింపుగా ఆలయం ఆలయ రాజగోపురం మీదుగా వెలుపలికి తోడ్కొని వచ్చి మేళతాలాల నడుమ పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన తెప్పపై ఆశీనులను చేసి విశేష పూజాదికాలు చేశారు. నంతరం మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రాలతో శాస్త్రక్తంగా తెప్పోత్సవం జరిపారు.

● నేడు పూర్ణాహుతి..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవ క్రతువులకు ఆదివారం పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి అనంతరం కలశోద్వాసన, అవబృథం, త్రిశూలస్నానం, వసంతోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజావరోహణ చేయనున్నారు.



శ్రీశైలంలో విద్యుద్దీప కాంతుల మధ్య తెప్పోత్సవం



శ్రీశైలంలో భక్తుల కోలాటం









మహానందిలో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



సింహ వాహనంపై ఊరేగితున్న స్వామి, అమ్మవార్లు



మహానందిలో భక్తుల జాగరణ

కమనీయం.. కల్యాణం

- వేలాది మంది భక్తుల నడుమ వేడుక
- సింహ వాహనంపై ఊరేగిన మహానందీశ్వరుడు

మహానంది, మార్చి 9: మహానంది క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారు జామున మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి అమ్మవార్ల కల్యాణం వేలాది మంది అశేష భక్తుల మధ్య రమణీయంగా జరిగింది. కల్యాణ దాతగా వ్యవహరించిన నంద్యాలకు చెందిన లక్కబోయిన ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులు కుటుంబ సమేతంగా ఆలయం ముఖ మండపం వద్దకు పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు. వీరికి ఆలయ ఈవోతోపాటు వేదపండితులు ఆహ్వానం పలికారు. ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలను దాతలు ఆలయ ఈవోకు అందజేశారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి వేదపండితులు కల్యాణం ప్రారంభించారు. మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి ఉత్సవమూర్తుల విగ్రహాలతోపాటు పెళ్లి పెద్దగా వ్యవహరించిన బ్రహ్మనందీశ్వరుడు, గంగాదేవి ఉత్సవమూర్తుల విగ్రహాలను మేళతాళాలతో ఆలయం ప్రాంగణంలోకి తీసుకొచ్చారు. శిరివెళ్ల మండలం గుండంపాడుకు చెందిన ముక్కమల్ల వంశస్తులతోపాటు దొర్నిపాడు మండలం గుండుపాపలకు చెందిన గంగవరపు వంశస్తులు కల్యాణానికి పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నంద్యాలకు చెందిన లక్కబోయిన ప్రసాద్ ఉత్సవ మూర్తుల ఊరేగింపు ముందు చేసిన శివతాండవం భక్తులను ఆకట్టుకుంది.

● ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం మహానందిలో సింహ వాహనంపై ఉత్సవమూర్తులకు వైభవంగా గ్రామోత్సవం జరిపారు. రాత్రి 9 గంటలకు పుష్ప పల్లకి సేవను నిర్వహించారు. ఉత్సవం ముందు మేళతాళాలతో పాటు తప్పెట్లు, కేరళ కళాకారుల వాయిద్య నృత్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

● మహానంది క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. కల్యాణం జరుపుకున్న స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులతో పాటు పెళ్లి పెద్దగా వ్యవహరించిన గంగా సమేత బ్రహ్మనందీశ్వరుని ఉత్సవమూర్తుల విగ్రహాలను ఊరేగిస్తున్నట్లు తెలిపారు.

కల్యాణ వైభోగమే..

ఘనంగా ఉమామహేశ్వర స్వామి కల్యాణోత్సవం



యాగంటిలో ఉమా మహేశ్వర స్వామి వార్ల కల్యాణం

బనగానపల్లె, మార్చి 9: యాగంటి క్షేత్రంలో రెండో రోజు శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉమా మహేశ్వరస్వాముల వారి కల్యాణోత్సవం శనివారం తెల్లవారు జామున వైభవంగా జరిగింది. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. వేదపండితుల సమక్షంలో ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం అత్యంత రమణీయంగా నిర్వహించారు. మహా శివరాత్రి లింగోద్భవం అనంతరం ప్రధాన అర్చకులు మహేశ్వరశర్మ, కిశోరయ్య, లోకనాథశర్మ, రామవేంద్రశర్మ సంయుక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భగా పలువురు భక్తులు ఉమా మహేశ్వరస్వామి వారికి కానుకలు సమర్పించారు. సాయంత్రం నందికోల ఉత్సవం సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఉమామహేశ్వర స్వామి కల్యాణోత్సవం సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ పరిధిలోని పలు అన్నదాన సత్రాల్లో భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రేలారేలా కళాకారుల నృత్య ప్రదర్శనలు, జానపద గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

క్రైస్తవ ద్రోహి జగన్‌రెడ్డి

- చంద్రబాబుతోనే క్రైస్తవుల సంక్షేమం
- టీడీపీ రాష్ట్ర క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడు స్వామిదాసు



సూపర్ సిక్స్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు

కర్నూలు(అర్బన్), మార్చి 9: జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో క్రైస్తవుల పేరుతో అధికారంలోకి వచ్చి ద్రోహం చేశాడని టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు స్వామిదాసు ధ్వజమెత్తారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు నేహమియా అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూపర్ సిక్స్ పథకాల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు జగన్ తాను క్రైస్తవుడ్ని అని, మీవాడ్ని అని క్రైస్తవులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక ఉన్న పథకాలను తొలగించారని విమర్శించారు. క్రైస్తవుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు క్రైస్తవుల కోసం అమలు చేస్తున్న పథకాలకంటే రెట్టింపు పథకాలను అందిస్తానని హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక క్రైస్తవులకు చేసింది శూన్యమన్నారు. పాస్టర్లకు గుర్తింపు కార్డులు, బీమా సౌకర్యం కల్పించడం, క్రిస్టియన్ కార్పొరేషన్ ప్రత్యేక గుర్తింపు ఇచ్చి ఆర్థికంగా బలోపేతం చేయడం, శ్మశాన వాటికల ఏర్పాటు, చర్చీలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పాస్టర్లకు గౌరవవేతనం ఇవ్వడం మొదలైనవాటిని ఆరు పథకాల్లో టీడీపీ అమలు చేస్తుందని అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం రూ.100 కోట్లు క్రైస్తవుల అభివృద్ధికి ఖర్చు చేస్తే జగన్ ప్రభుత్వం కేవలం రూ.40 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని గుర్తుచేశారు. సమావేశంలో రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షుడు బాబురాజ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

నందికొట్కూరులో యువకుల మధ్య ఘర్షణ

నందికొట్కూరు, మార్చి 9: పట్టణంలోని ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న గొడవ కాస్త రెండు వర్గాలుగా విడిపోయి రాడ్లతో దాడులు తీసుకునే స్థాయికి చేరుకుంది. పట్టణంలోని హాజీనగర్‌కు చెందిన ఇర్ఫాన్ అనే యువకుడు బైక్ రేజ్ పెంచుతూ ద్విచక్రవాహనాన్ని నడిపాడంటూ మొదలైన గొడవ గురువారం మొదలై శుక్రవారం సంగయ్యపేటలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇర్షాద్(18) అనే యువడికి తలపై బలమైన గాయాలు అయ్యాయి. కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యులు ఆపరేషన్ చేసినట్లు తెలుస్తోంది. హరీఫ్, సంతోష్ అనే ఇద్దరికి దెబ్బలు తగిలాయి. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ రమణ తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగులు ఇక రెగ్యులర్

- తొలి రోజు 129 మందికి ఆర్డర్స్‌ను అందించిన డీఎంహెచ్‌వో



నియమపత్రాలను అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), మార్చి 9: 20 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగుల నిరీక్షణకు తెరపడింది. రాష్ట్రంలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగుల్లో అర్హులందరికీ రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం జీవో.నెంబర్.30, 31 విడుదల చేసింది. దీంతో వైద్యఆరోగ్యశాఖలో కాంట్రాక్టు విధానంలో వివిధ క్యాడర్లలో పని చేస్తున్న ఉమ్మడి జిల్లాలో 129 మందికి కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులు రెగ్యులర్ అయ్యాయి. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 167 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్నారు. శనివారం 75 మంది హెల్త్ అసిస్టెంట్లు (మేల్), 40 మంది ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్లు, ఐదుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, 9 మంది ఫార్మాసిస్టుల సర్వీసు రెగ్యులర్ అయిన వారిలో ఉన్నారు. డీఎంహెచ్‌వో డా.బి. రామగిడ్డయ్య, కార్యాలయ ఏవో కె. అరుణ, ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు, 129 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజేషన్ ఆర్డర్స్ అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 167 మంది కాంట్రాక్టు ఉద్యోగుల్లో 129 మందికి శనివారం రెగ్యులర్ ఉద్యోగులుగా ఆర్డర్స్ ఇచ్చామని అన్నారు. మిగిలిన ఉద్యోగులకు త్వరలో రెగ్యులర్ ఆర్డర్స్ రానున్నట్లు తెలిపారు.

వైసీపీని వెనక్కి పంపడం ఖాయం

- జగన్ పాలనలో అవినీతి తప్ప.. అభివృద్ధి లేదు
- కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్‌లో పర్యటిస్తున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

డోన్, మార్చి 9: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని రాబోయే ఎన్నికల్లో ప్రజలు ప్యాకప్ చేసి పంపడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 14, 15 వార్డులలో ఆయన పర్యటించారు. ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అవినీతి తప్ప ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. వైసీపీ పాలనలో ప్రతి పనికి కమిషన్లు దండుకుని జేబులు నింపుకున్నారే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులివ్వకుండా వైసీపీ ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి స్కీములో వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా స్కాములకు పాల్పడ్డారని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలన రావాలని రాష్ట్ర ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. డోన్ నియోజకవర్గ ప్రజలకు, ఆ పార్టీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని కోట్ల స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, చిట్యాల మద్దయ్య గౌడు, శ్రీనివాస భట్, భాస్కర్ నాయుడు, ఆలేబాదు పరమేష్, చంద్రపల్లి ఆచారి, అన్వర్ బాషా, ఎస్ఎండీ రఫీ, ఎల్లగౌడు, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, దిలీప్‌రెడ్డి, పరదేశి మహేష్ పాల్గొన్నారు.


జాతీయ స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీలకు హసీనా



కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 9: ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో హత్రాస్‌లో ఆదివారం నుంచి జరిగే 52వ జాతీయ స్థాయి మహిళల హ్యాండ్‌బాల్ పోటీలకు కర్నూలు జిల్లాకు చెందిన షేక్ హసీనా ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి డా.రుద్రరెడ్డి తెలిపారు. గతంలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం శుభపరిణామ మన్నారు. హసీనా ఎంపికపై జిల్లా సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తంచేశారు.

అడవి ఒడిలోకి పెద్ద పులి

- విజయవంతమైన చికిత్స ● రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్
- పులి కోలుకోవడంతో నల్లమలలో వదిలిన అధికారులు
- నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వు పరిధిలో అరుదైన ఘటన



అడవిలోకి పెద్దపులిని వదిలేస్తున్న దృశ్యం



కోలుకున్న పెద్దపులి ఇదే

ఆత్మకూరు, మార్చి 9: నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ పరిధిలో వేటగాళ్ల ఉచ్చులో చిక్కి తీవ్రంగా గాయపడిన పెద్దపులికి అటవీ అధికారులు వైద్యం చేయించి శుక్రవారం సురక్షితంగా నల్లమలలో వదిలారు. ఈ విషయం శనివారం అటవీ అధికారులు తెలిపారు. ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలోని ముసలిమడుగు బీట్ పరిధిలోని సందుబాట రస్తాలో ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్‌లో మూడేళ్ల వయస్సు గల ఓ ఆడపులికి నడుము భాగంలో బైక్ క్లచ్ వైర్ లాంటి ఉచ్చు బిగుసుకొని తీవ్రంగా గాయపడినట్లు ఫిబ్రవరి 25న అటవీ అధికారులు గుర్తించారు. ఈ విషయం నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) దృష్టికి వెళ్లడంతో రెస్క్యూ ఆపరేషన్ ద్వారా గాయపడిన పులిని బంధించి చికిత్స చేయించాలని సూచించారు. ఈమేరకు మహారాష్ట్రలోని పూణేకు చెందిన ఐదుగురు రెస్క్యూ టీంతో పాటు 50 మంది అటవీశాఖ ఉద్యోగులు, ప్రొటెక్షన్ వాచర్లు బృందంగా ఏర్పడి పులిని బంధించేందుకు రాత్రిపగళ్లు ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు మార్చి 5వ తేదిన కొత్తపల్లి బీట్‌లోని అటవీ ప్రాంతంలో పులిని గుర్తించి ఎన్‌క్లోసర్ గన్ ద్వారా మత్తు మందు ఇచ్చారు. మత్తులోకి జారుకున్న పెద్దపులిని బోనులో ఎక్కించి వన్యప్రాణి సంరక్షణ వాహనంలో బైర్లూటిలోని వన్యప్రాణి వైద్య చికిత్స కేంద్రానికి తరలించి వైల్డ్‌లైఫ్ వెటర్నరీ డాక్టర్లచే చికిత్సలు అందించారు. నాలుగు రోజుల వైద్యం తర్వాత పులి కోలుకుంది. దీంతో పులిని శుక్రవారం రాత్రి నల్లమలలోని సురక్షితమైన అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు వదిలేశారు. అడవిలో గాయపడిన పెద్ద పులిని గుర్తించి, వైద్యం చేయించి, తిరిగి అడవిలో వదలడం అరుదైన విషయమని అటవీ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు.

పాపం చిరుత

- రోడ్డు దాటుతూ గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి



మృతి చెందిన చిరుతపులి

ఎమ్మిగనూరు, మార్చి9: ఎమ్మిగనూరు పట్టణ శివారులోని ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఎమ్మిగనూరు-ఆదోని జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి రోడ్డు దాటుతూ ఏడాది వయసున్న ఓ చిరుత పులి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. హనుమాపురం, గుడికల్ గ్రామాల సమీపంలో ఉన్న కొండల్లో నుంచి చిరుత అర్ధరాత్రి బయటికి వచ్చి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. సమాచారం అందుకున్న డివిజన్, జిల్లా అటవీశాఖ అధికారులు శివశంకర్ రెడ్డి, తేజస్విని, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని చిరుత పులి మృతదేహాన్ని పరిశీలించారు. నిబంధనల మేరకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో కోటేకల్ అటవీ ప్రాంతానికి మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ డివిజన్‌లోని ఎమ్మిగనూరు, కోసిగి, ఆలూరు, ఆస్పరి, తుగ్గలి, హొళగుంద ప్రాంతాల్లో కొండలు, గుట్టలు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాలు చిరుతలకు నివాసయోగ్యంగా ఉన్నాయని వాటికి కావలసిన ఆశ్రయం, ఆహారం దొరుకుతుందన్నారు. కుక్కలు, మేకల కోసం బయటికి వస్తున్నాయన్నారు. ఇందులో భాగంగానే గుడికల్ కొండల్లో నుంచి చిరుతపులి బయటికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందన్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న గుట్టలు అన్ రిజర్వుడు ఫారెస్టులో ఉన్నాయన్నారు. సమీప గ్రామాల్లో ప్రజలకు అవేర్నెస్ కలిగించేందుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు.



చిరుతపులి కనిపించకుండా అడ్డంగా పరదా కట్టి కాపలా ఉన్న అధికారులు

- **24రోజుల క్రితం గుడికల్ కొండల్లో :** ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్ గ్రామ కొండల్లో సంచరిస్తున్న చిరుత పులి మూగజీవాల కాపరుల ఉచ్చుకు చిక్కింది. అటవీ శాఖ అధికారులు చిరుతకు మత్తు మందు ఇచ్చి కాపాడారు. ఇప్పుడు మళ్లీ ఆదోని జాతీయ రహదారిపైకి రోడ్డు ప్రమాదానికి గురై మరో చిరుత పులి మృతిచెందింది. దీంతో ప్రజలు రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. పొలం పనులకు వెళ్లడానికి ఆందోళన చెందుతున్నారు. గత కొంత కాలంగా కోటేకల్, మల్కాపురం, దేవిబెట్ట కొండల్లో చిరుత పులులు సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి కొండల్లో సైతం చిరుత పులులు సంచరిస్తున్నాయి. ఎమ్మిగనూరు మండలం గుడికల్ కొండల్లో " ఇంకా చిరుతలు ఉన్నాయా? అని సమీప గ్రామాల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ అదే నిర్లక్ష్యం..!

- అనుమతులు లేకుండానే కృష్ణా నదిలో మరబోట్ల సర్వీసులు
- పట్టించుకోని పోలీసు, రెవెన్యూ అధికారులు



సంగమేశ్వరంలోని కృష్ణానది జలాలపై అనుమతి లేకుండా నడుపుతున్న మరబోట్లు

ఆత్మకూరు, మార్చి 9: కృష్ణానదిలో మరబోట్ల నిర్వహణలో అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీశైలం వెనకతట్టు జలాల్లో భక్తులను పరిమితికి మించి మరబోట్లలో నిర్వాహకులు ఎక్కించుకున్నారు. మరబోట్లను నడిపేందుకు అనుమతులు లేనప్పటికీ కొందరు యథేచ్ఛగా సర్వీసులను కొనసాగిస్తున్నారు. దీనికితోడు పరిమితికి మించి ప్రయాణికుల్ని పడవల్లో ఎక్కించుని సొమ్ము చేసుకుంటున్నారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆవలి తెలంగాణ ప్రాంతానికి చెందిన భక్తులు క్షేత్రానికి పోటెత్తారు. అయితే సంగమేశ్వరానికి చెందిన మరబోట్ల నిర్వాహకులు ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకుండా భారీ సంఖ్యలో జనాన్ని పడవల్లో ఎక్కించుకుని నదీజలాలపై రాకపోకలు సాగించారు. ఒక్కో మరబోటులో 20 మందికి మించి ప్రయాణికుల్ని ఎక్కించుకోరాదు. అయితే బోట్ల నిర్వాహకులు ఒక్కో బోటులో 40 నుంచి 50 మంది వరకు ప్రయాణికుల్ని తరలించి సొమ్ము చేసుకున్నారు. సోమశిల నుంచి సంగమేశ్వరం నదీజలాలపై 2కిమీల దూరం ఉంటుంది. ఈ ప్రయాణానికి ఒక్కొక్కరి నుంచి రూ.100పైగా వసూలు చేసినట్లు తెలిసింది. కనీసం మరబోట్లలో లైఫ్‌జాకెట్లు లేకుండానే, భారీ సంఖ్యలో జనాన్ని తరలించారనే విమర్శలు ఉన్నా యి. గతంలో కృష్ణానదిలో అనుమతుల్లేకుండా మరబోట్లను నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించిన పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వచ్చాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతో బోట్లను నిర్వాహకులు నడిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి సంగమేశ్వర పరిసర ప్రాంతాల్లో శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో అనుమతులు లేకుండా మరబోట్లను నడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

బిందు సేద్యంపై దృష్టి పెట్టండి

- నీటి కొరత లేకుండా పంటలు సాగు చేయండి
- ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 9: వర్షాభావం వల్ల పంటలకు సరిపడ నీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో బిందు సేద్యం ఉపయోగకరమని, రైతులు దానిపై శ్రద్ధ పెట్టాలని డ్రిప్ ఇరిగేషన్ కర్నూలు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పత్తి, మిరప, టమోటా, ఉల్లి, వేరుశనగతో పాటు కూరగాయల పంటల్లో సూక్ష్మ సేద్యం వినియోగాన్ని పెంచాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని అమలులోకి తెచ్చాయని స్పష్టం చేశారు. రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోడానికి, భూగర్భ జలాలను పొదుపుగా వాడేందుకు సూక్ష్మ సేద్యాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. ఐదెకరాలలోపు రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని, 5 నుంచి 10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం సబ్సిడీని అందిస్తున్నాయని తెలిపారు. ఈ సంవత్సరానికి 5వేల హెక్టార్ల బిందుసేద్యం లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించామని అన్నారు. ఇప్పటికే 4,614 మంది రైతులు 4,335 హెక్టార్లల్లో బిందు సేద్యం పరికరాల ఏర్పాటు చేశామన్నారు. 2022-23 సంవత్సరంలో రూ.35.96 కోట్లు, 2023-24లో రూ.36.34 కోట్లు మొత్తం రెండేళ్లలోనే రూ.72.10 కోట్ల రాయితీని రైతులకు ప్రభుత్వం అందించినట్లు తెలిపారు. 2024లో డ్రిప్ పరికరాల ఏర్పాటుకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టామని, రైతులకు ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు గ్రామ గ్రామాన తమ శాఖ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

ఇదేనా సమన్యాయం?

- దళిత మహిళా సర్పంచ్‌కు అవమానం
- వివాదాస్పదంగా మారిన బుట్టా రేణుక వ్యవహార శైలి
- సోషల్ మీడియాలో వైరల్



హెచ్. కైరవాడి దళిత మహిళా సర్పంచ్‌ను కింద కూర్చోబెట్టి మాట్లాడుతున్న వైసీపీ సమన్వయకర్త బుట్టా రేణుక

గోనెగండ్ల, మార్చి 9: 'నా ఎస్సీలు.. నా ఎస్టీలు.. నా బీసీలు..' అంటూ ఎక్కడ మైక్ దొరికినా సీఎం జగన్ ఊకదంపుడు ప్రసంగాలు చేస్తుంటారు. బడుగు, బలహీనవర్గాలకు తనతో పాటు వైసీపీ నేతలందరూ గౌరవ మర్యాదలు ఇస్తుంటారని సీఎం జగన్ ప్రగల్భాలు పలుకుతుంటాడు. కానీ అందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో ఆ పార్టీ నేతల వ్యవహార శైలి విమర్శలకు తావిస్తోంది. తాజాగా ఎమ్మిగనూరు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక వైసీపీకి చెందిన దళిత సర్పంచులను అవమానించేలా వ్యవహరించారంటూ సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అవుతున్నాయి. మార్చి ఆరో తేదీన బుట్టారేణుక గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడి గ్రామంలో పర్యటించారు. అదేరోజు గ్రామ పెద్ద అరుణమ్మ రెడ్డి నివాసంలో వైసీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమయంలో బుట్టా రేణుకతో పాటు పెద్ద అరుణమ్మ రెడ్డి పైన కూర్చొని గ్రామ ప్రథమ మహిళ, దళిత సర్పంచ్ సూర్యపోగు సువర్ణమ్మను కింద కూర్చోబెట్టి మాట్లాడారు. ప్రస్తుతం ఈ ఫొటో నియోజకవర్గ వ్యాప్తంగా వైరల్‌గా మారింది.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

క్రిష్ణగిరి, మార్చి 9: విద్యుత్ మోటర్ స్విచ్ ఆన్ చేస్తుండగా కరెంట్ షాక్‌తో క్రిష్ణగిరికి చెందిన కమ్మరి లక్ష్మణాచారి(27) శనివారం మృతి చెందాడు. క్రిష్ణగిరి రిజర్వాయర్ సమీపంలోని పొలానికి తండ్రి కమ్మరి నాగరాజు వెళ్లాడు. మోటర్ ఆన్ చేసి వస్తానని కొడుకు లక్ష్మణాచారి వెళ్లాడు. ఆ తర్వాత ఎంత సేపటికి కొడుకు రాకపోవడంతో నాగరాజు వెళ్లి చూశాడు. విద్యుదాఘాతంతో లక్ష్మణాచారి కరెంట్ మోటర్‌పై పడిపోయి కనిపించాడు. నాగరాజు కేకలకు చుట్టుపక్కల వాళ్ళు వచ్చి కరెంట్ సరఫరా బంద్ చేసి లక్ష్మణాచారిని బయటికి తీశారు. అప్పటికే అతను మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది. నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

గడ్డివాములు దగ్ధం



చాగలమర్రి, మార్చి 9: మండలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో టీడీపీ నాయకులకు చెందిన రామ్మోహన్‌రెడ్డి, ఓబుళరెడ్డికి చెందిన మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఆళ్లగడ్డ అగ్నిమాపకదళ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో రూ.2.50 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. తాము టీడీపీలో ఉండటంతో ఎవరో కక్షకట్టి ఈ దారుణానికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. తమకు ప్రమాద బీమా ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

ట్రాక్టర్ కింద పడి బీహార్ వాసి మృతి

పగిడ్యాల, మార్చి 9: మండల పరిధిలోని లక్ష్మాపురం అంచె సమీపంలో ట్రాక్టర్ ట్యాంకరు బోల్తా పడిన సంఘటనలో బీహార్‌కు చెందిన జయకాంత్ మాకియా(26) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. కొలిమిగుండ్ల నుంచి హైదరాబాద్ పోలార్ పవర్ గ్రిడ్ పనులు చేసేందుకు బీహార్ రాష్ట్రం పచాడి గ్రామానికి చెందిన కొంత మంది నెల కిందట లక్ష్మాపురం వచ్చారు. భాస్కరెడ్డికి చెందిన పొలం సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ టవర్ దిమ్మెలను జయకాంత్ ట్రాక్టర్ ట్యాంకర్‌తో క్యూరింగ్ చేశాక గుడిసె వద్దకు వస్తుండగా రోడ్డు మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జయకాంత్ ట్రాక్టర్ టైరు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కాంట్రాక్టర్ అమిత్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు.

నీట మునిగి వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, మార్చి 9: కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లె గ్రామం సమీపంలో ఉన్న లొక్కిగుండంలో స్నానం చేస్తూండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మారుతి(44) అనే వ్యక్తి శనివారం మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. తాడిపత్రి పట్టణంలో శివన్న నగర్‌కు చెందిన మారుతి లొక్కిగుండం శివాలయానికి వచ్చారు. నీటి గుండంలో దిగి స్నానం చేస్తుండగా ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుని భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు

అట్టహాసంగా క్రీడలు ప్రారంభం



వాలీబాల్ ఆడుతున్న పశు వైద్యులు

పాణ్యం, మార్చి, 9 : ప్రపంచ పశువైద్యుల దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా పశువైద్యుల క్రీడలు శనివారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను జిల్లా పశు వైద్యాధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సుధాకరరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇవి జిల్లాలో నిర్వహిస్తున్న మొట్టమొదటి పశువైద్యుల క్రీడలన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ క్రీడల్లో జిల్లాలోని 90 మంది పశువైద్యులు పాల్గొంటున్నట్లు తెలిపారు. క్రికెట్, షటిల్, క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, బాస్కెట్‌బాల్, స్పూన్‌లెమన్, మ్యూజిక్ చైర్ తదితర విభాగాలలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ చిన్నబాబు, ఆర్జీఎం పిడి వెంకటేశ్ పాల్గొన్నారు.

మురుగు కాల్వల నిర్మాణానికి భూమి పూజ



ముస్లింల శ్మశాన వాటిక రక్షణ గోడను ప్రారంభిస్తున్న సర్పంచ్ కంచర్ల శోభారాణి

బండిఆత్మకూరు, మార్చి 9: మండలంలోని జీసీపాలెం గ్రామంలో మురుగు కాల్వల నిర్మాణానికి భూమి పూజ చేశారు. శనివారం సర్పంచ్ కంచర్ల శోభారాణి, మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, ఉపసర్పంచ్ కంచర్ల చిన్న లింగారెడ్డి ఇందులో పాల్గొన్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన ముస్లిం శ్మశానం రక్షణ గోడను ప్రారంభించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, మాబూసాహెబ్, షఫీవుల్లా, హుస్సేన్, మున్నీర్, చంద్రపాల్, సామేల్ పాల్గొన్నారు.

14న రైతు సమస్యలపై నిరసనలు



మాట్లాడుతున్న రాజశేఖర్

ఆత్మకూరు, మార్చి 9: రైతాంగం, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఈ నెల 14వ తేదిన జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. ఈమేరకు శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని, మద్దతు ధరల చట్టం చేయాలని అన్నారు. రైతు రుణ మాఫీ చేయడంతో పాటు కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలని చెప్పారు. అంతేకాకుండా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని అన్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లను కేటాయించి ఏడాదిలో 200 పనిదినాలతో దినసరి వేతనం రూ.600 ఇవ్వాలని అన్నారు. ఆహార భద్రతా చట్టాని పటిష్టపర్చాలని తెలిపారు. సీసీఆర్ చట్టాన్ని సవరించాలని, కౌలు రైతులకే నష్టపరిహారాలు, బీమా ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు సుధాకర్, మాబాషా, వీరన్న, రామ్‌నాయక్, రణధీర్, నాగేశ్వరరావు, కిరణ్, సత్యనారాయణ, రాజేష్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



బైర్లూటి పీహెచ్‌సీలో గర్భిణికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్, మార్చి 9: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా బైర్లూటి పీహెచ్‌సీలో 65 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారులు మాట్లాడుతూ.. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖుద్దూస్‌బాషా, సూపర్‌వైజర్ రమణమ్మ, ఆశా, అంగన్‌వాడి,ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా పేర్కొన్నారు. శనివారం ఆమె ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణీలకు అందుతున్న వైద్యపరీక్షలను పరిశీలించారు. అలాగే నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అదే విధంగా ఆసుపత్రి రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరు అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

పాస్టర్లపై దాడులను అరికట్టాలి

ఆత్మకూరురూరల్, మార్చి 9: పాస్టర్లపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని అరికట్టాలని పాస్టర్‌లు ఏ. ఆమోస్, పి. జయరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆత్మకూరు ఆర్‌అండ్ బి అతిథి గృహంలో ఏపీ లోకాయుక్త చైర్మన్‌కు వారు దళిత సంఘాలతో కలిసి ఓ వినతి పత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ మండలంలోని కరివేన గ్రామంలోని బెరేకా ప్రార్థనా మందిరం పాస్టర్ పీ. జయరాజు పట్టణంలోని బేతేలు ప్రార్థనా మందిరం పాస్టర్ ఆమోస్‌లపై చర్చి ఆస్తుల కోసం విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు అనే వ్యక్తులు దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. గతంలో దళిత సంఘాలతో కలిసి ఆ ఇద్దరిపై స్టేషన్‌లో ఫిర్యాదులు చేసినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, చర్చికి సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా వారి దాడుల నుండి మాకు రక్షణ కల్పించి చర్చి ఆస్తులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వీరి వెంట మాల మహానాడు రాష్ట్ర నాయకులు శీలం శేషు, కేవీపీఎస్ జిల్లా నాయకులు ప్రాత కోట భాస్కర్‌లు ఉన్నారు.

కమనీయం కల్యాణం



సంగమేశ్వరంలో...





రుద్రకోటేశ్వర క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం

నంద్యాల: సంజీవనగర్ కోదండ రామాలయంలో శివపార్వతుల కల్యాణం

నంద్యాల (కల్చరల్), మార్చి 9: పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని లింగోద్భవకాలంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం రాత్రి 12.30 గంటలకు శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. సంజీవనగర్ కోదండరామాలయంలో భగవత్ సేవాసమాజ్ కమిటి ఆధ్వర్యంలో స్వామివారికి శుక్రవారం రాత్రి 12గంటలకు అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణం ప్రథమనందీశ్వరాలయంలో అర్చకులు ప్రవీణ్ కుమార్, ఎన్‌కె రోడ్డులోని నాగలింగేశ్వరాలయం, మల్లికార్జునస్వామి ఆలయం, బ్రహ్మనందీశ్వరాలయంలో లింగోద్భవకాలంలో అభిషేకాలు, కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో ఈవో లక్ష్మీనారాయణ, భీమలింగేశ్వరాలయంలో ఈవో రామాంజనేయశర్మ ఆధ్వర్యంలో వైభవంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో కాశీమాత భక్తులు, భగవత్ సేవా సమాజ్ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● నంద్యాల పలు ఆలయాలలో శుక్రవారం అర్ధరాత్రి శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం శనివారం ఆయా ఆలయాల నిర్వహకుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు అంగరంగ వైభవంగా పట్టణ వీధులగుండా ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా నాగలింగేశ్వరుని కళ్యాణం

పాణ్యం: కొత్తూరులోని నాగలింగేశ్వరస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో నాగలింగేశ్వర సహిత పార్వతి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు.

● పాణికేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున లింగోద్భవ కాలమందు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, పానక వందేరం నిర్వహించారు. నెరవాడ గ్రామానికి చెందిన శిరిగిరి ప్రసాదరెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

రుద్రకోటేశ్వరుడి కల్యాణోత్సవం

ఆత్మకూరు: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన అతిప్రాచీన రుద్రకోటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రుద్రాణి సమేత రుద్రకోటేశ్వర స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. అనంతరం కళ్యాణమూర్తులకు ఆలయ ప్రాంగణంలో పల్లకిసేవను నిర్వహించారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి గర్భాలయంలోని శివలింగానికి లింగోద్భవ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.

వైభవంగా రథోత్సవం

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామంలో శివరాత్రి పండుగను పురష్కరించుకుని కాశీవిశ్వనాథస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. దేవాలయం నుంచి రథోత్సవంపై స్వామివారిని ఊరేగించారు.

లలితా సంగమేశ్వరుల కళ్యాణం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని సప్తనది తీరంలోని సంగమేశ్వరంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని లలితా సంగమేశ్వరుల కల్యాణం కమణీయంగా జరిగింది. శనివారం ఆలయ ప్రాంగణంలో అశేష భక్తజనవాహిని మధ్య ఆలయ ఈవో సీతామోహన్ పర్యవేక్షణలో పురోహితులు తెలకలపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో లలితా సంగమేశ్వరుల కల్యాణం నేత్రానందంగా సాగింది. ప్రాతకాల సమయంలోనే వేపదారు శివలింగానికి పవిత్ర కృష్ణానది జలాలచే రుద్రాభిషేకం, సహస్రనామార్చన, పుష్పార్చన తదితర ప్రత్యేక పూజాదిక్రతువులు జరిగాయి. స్వామి, అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించేందుకు ఉభయ రాష్ట్రాల నుంచి భక్తులు అశేష సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఈవో సీతామోహన్ మాట్లాడుతూ భక్తులు స్వామివారి హుండీలో వేసిన కానుకలను లెక్కించగా.. రూ72,500 ఆదాయం లభించినట్లు చెప్పారు.

ఆత్మకూరురూరల్: వెంకటాపురం గ్రామంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవం శనివారం కమనీయంగా సాగింది. కల్యాణ వేడుకలను కుందూరు నాగేశ్వరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.

గడివేముల: మండలంలోని దుర్గాభోగేశ్వర ఆలయంలో శనివారం వేకువజామున దుర్గాభోగేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది.



ఆత్మకూరు మండలం వెంకటాపురంలో...



తంగడంచలో కోలాటం ఆడుతున్న చిన్నారులు



పాణ్యంలో శివయ్యకు పూజలు



నంద్యాలలో స్వామివార్ల కల్యాణం



సంగమేశ్వరాలయంలో స్వామివారికి పూజలు



గడివేముల: దుర్గాభోగేశ్వర ఆలయంలో...

ఆకలి తీర్చుతున్న అన్నదాన సత్రాలు



మహానంది, మార్చి 9: మహానంది క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించడానికి వస్తున్న వేలాది మంది భక్తులకు అన్నదాన సత్రాలు భక్తుల ఆకలి తీర్చుతున్నాయి. భక్తులకు వివిధ రకాల వంటలతో ఆహార పదార్థాలు సిద్ధం చేసి ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం,రాత్రి వేళల్లో అన్నదానం చేస్తున్నారు. ఇందులో రెడ్డి,కమ్మ ఆర్యవైశ్య, వడియరాజులు, పద్మశాలీ, యాదవ, రజక,కుమ్మరి,మాదిగ కులస్తులు కులమతాలకు అనుగుణంగా అన్నదానం చేస్తున్నారు. ఆదివారం వరకు అన్నదానం నిర్వహిస్తామని ఆయా కులసంఘాల కమిటీ సభ్యులు తెలిపారు.

రమణీయం..

శ్రీశైల మల్లన్న రథోత్సవం శనివారం సాయంత్రం వేలాది భక్తుల నడుమ వైభవంగా సాగింది. రథశాల వద్ద ఆలయ అర్చకులు రథానికి రథాంగపూజ, రథాంగహోమం, రథాంగబలి కార్యక్రమాలను నిర్వహించారు.





కోలాటం ఆడుతున్న కళాకారులు



స్వామి, అమ్మవార్లకు పూజలు

పోటాపోటీగా ఎద్దుల బండలాగుడు పోటీలు



శివనందిలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

బండిఆత్మకూరు, మార్చి 9: మహాశివరాత్రి పర్వదినోత్సవాలను పురష్కరించుకుని ఓంకారంలో జూనియర్ విభాగం, శివనంది, కృష్ణనంది దేవస్థానాల్లో ఏర్పాటు చేసిన పాలదూళ్ళ సైజు విభాగపు పోటీలను శిల్పా కార్తీక్ రెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. శనివారం ఓంకారంలో ఆరు జతలు, కృష్ణనందిలో 14 జతలు, శివనందిలో ఆరు జతల ఎద్దులు పోటీలలో పాల్గొన్నాయి. ఆయా ఆద్యంతం పలు జతల మధ్య పోటీ నువ్వా, నేనా అన్న రీతిలో కొనసాగాయి. గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు రాగాల వెంకటరమణ, బాబుల్, వెంకటేశ్వర్లు, సోమశేఖర్‌రెడ్డి, దక్షినేశ్వరరెడ్డి, ఆదిలక్ష్మిరెడ్డి, బాలీశ్వరరెడ్డి నగదు బహుమతులను విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ తిరుపంరెడ్డి, మహేంద్రారెడ్డి, బాలస్వామి పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

మహానంది: మహానంది మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఇందులో సీనియర్స్ విభాగంలో 6 జతల ఎడ్ల బల ప్రదర్శనలో పోటీల్లో పాల్గొన్నాయి. వీటిని తిలకించడానికి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుండి వేలాదిమంది ప్రజలు తరలి వచ్చారు.

● మహానందిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్ర ఎద్దుల బల ప్రదర్శన పోటీలలో సీనియర్స్ విభాగంలో వరుసగా యస్. యస్ బుల్స్ కుకట్‌పల్లి కి చెందిన ఎద్దులు 2221.8 అంగుళాలు, డివిఆర్ మొమోరియల్ కానూరు కృష్ణాజిల్లాకు చెందిన ఎద్దులు 2208.10 అంగుళాలు, పిఆర్ మెమోరియల్ గుంటూరు జిల్లాకు చెందిన ఎద్దులు 2026.7అంగుళాలు, ఆర్‌కె బుల్స్ వేటపాలెం బాపట్లకు చెందిన ఎద్దులు 1510.7 అంగుళాలు, పి ఆర్ మెమోరియల్ గుంటూరుకు చెందిన ఎద్దులు 411 అంగుళాలు బండను లాగాయి. విజేతలైన ఎద్దుల యజమానులకు పోటీల క్రీడా మైదానంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయ కర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, రైతు కమిటీ సభ్యులు కొమ్మా మహేశ్వరరెడ్డి, కందుల రఘురామిరెడ్డి, వడ్డె శ్రీనులు నగదు బహుమలు అందజేశారు.

ఆసక్తిగా వృషభాల బలప్రదర్శన

గడివేముల: శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలోని దుర్గాభోగేశ్వర ఆలయంలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఒంగోలు వృషభాల బలప్రదర్శన ఆకట్టుకుంది. ఈ పోటీలలో 12 జతల వృషభాలు పాల్గొనగా బిల్లలాపురంకు చెందిన భూమా గోవర్ధన్‌రెడ్డి 3,902 అడుగులు లాగి మొదటి స్థానాన్ని, పోలూరు రామసుబ్బారెడ్డి, జలదుర్గం మద్దిలేటి వృషభాలు 3,600 అడుగులు లాగి రెండో స్థానంలో, కొణిదెలకు చెందిన దండు నరసింహులు వృషభాలు 3,425 అడుగులు లాగి మూడో స్థానంలో, గద్వాల్‌కు చెందిన పాగుంటన్న వృషభాలు 3,368 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలిచాయి. గెలిచిన వృషభాల యజమానులకు బహుమతుల దాత శాంతిరామ్ విద్యాసంస్థల అధినేత మిద్దె శివరామ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సునిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్న వైసీపీ

పాణ్యం, మార్చి, 9 : వైసీపీ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తుందని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి రాంమోహన్‌నాయుడు అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టించుకోకుండా ఇప్పుడు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఓటర్లకు ప్యాంటు, షర్టు, కుక్కర్లు, టీకప్ సెట్లు, మిఠాయిలు, సెల్ ఫోన్లు ఇస్తుందన్నారు. ఓడిపోతామన్న భయం పట్టుకొని ప్రజలను కానుకలతో మభ్యపెడుతుందన్నారు. జిల్లాలోని ఒక వైసీపీ ఎమ్మెల్యే ఇప్పటికే తమ కనుకూలమైన వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తాన్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి ప్రభుత్వం తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఈ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్



మాట్లాడుతున్న వై నాగేశ్వరరావుయాదవ్

ప్యాపిలి, మార్చి 9: దుర్మార్గమైన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో పార్టీ కార్యాలయం కోసం భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుయాదవ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అధికార పార్టీ నేతలు అరాచకాలకు, దోపిడీలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైసీపీ పాలనపై విసుగుచెందిన ప్రజలు ఎప్పుడు ఎన్నికలు వచ్చిన ఆ పార్టీని ఇంటికి పంపడం ఖాయమన్నారు. అందరూ కలసి కట్టుగా ఉండి డోన్‌లో టీడీపీ జెండాను ఎగురవేస్తామన్నారు. టీడీపీ మేనిఫెస్టోను గ్రామ గ్రామాన తిరిగి ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వలసల రామక్రిష్ణ, టి శ్రీనివాసులు, రామ్మోహన్ యాదవ్, చల్లా వీరాంజినేయులు, వెంకటరమణాచారి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రాతిదూలం పోటీలు ప్రారంభం

కొలిమిగుండ్ల, మార్చి 9: కొలిమిగుండ్ల మండలం నాయినిపల్లె, పెట్నికోట గ్రామాల మధ్య వెలసిన గుండుమల్లేశ్వర స్వామి మైదానంలో శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసినా రాష్ట్ర స్థాయి రాతిదూలం పోటీలను జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు మొదటి బహుమతి రూ30 వేలు గెలుపొందాయి. రెండో బహుమతి రూ.20 వేలు నంద్యాల జిల్లా సంజామల మండలం ముక్కమళ్ళ గ్రామానికి చెందిన ఎమ్ చంద్రశేఖర్ రెడ్డి, మూడో బహుమతి రూ.10 వేలు బనగానపల్లె మండలం సాదుకొట్టం గ్రామానికి చెందిన ఎస్ గోపాల్, నాలుగో బహుమతి రూ.5వేలు ప్యాపిలి మండలం రంగాపురం గ్రామానికి చెందిన జూటూరు సందీప్ రెడ్డి ఎద్దులు గెలుపొందాయి. విజేతలకు మాజీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్ రెడ్డి, ఎద్దుల యజమానులు పాల్గొన్నారు.

రాజశేఖర్ ఎంపికపై హర్షం

కోవెలకుంట్ల, మార్చి 9: ఎరుకల సేవా సంఘం నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు పెనుగొండ రాజశేఖర్ ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలో పెనుగొండ రాజశేఖర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఎరుకల సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా ఎంపిక కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజతలు తెలిపారు. కార్యక్రమంలో రాముడు, మధు కిశోర్, సురేష్ బాబు, రమేష్, శేఖర్, శివప్రసాద్, మురళి, టీడీపీ నాయకుడు కుళ్ళాయి పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

బేతంచెర్ల, మార్చి 9: ముస్లిం మైనార్టీ యువత వ్యసనాలకు దురంగా ఉండాలని మండల ఖాజీ నూర్ అహ్మద్ అన్నారు. శనివారం పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో బేతంచెర్ల ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మహబూబ్ వలి, సద్దాం ఆలిభేగ్, ఉపాధ్యక్షులు షేక్ హుశేన్, షేక్షావలి ఆధ్వర్యంలో కమిటీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ముర్తుజావలి, ఖాజా హుశేన్, అజ్మతుల్లా, సత్తార్, సాధిక్, పిట్టల జాకీర్, వన్నూరు సాహేబ్, మాబా షా, సయ్యద్ ఖాజా, సలీం దస్తగిరి పాల్గొన్నారు.

యువతకు ఓటే కీలకం

శిరివెళ్ల, మార్చి 9: రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పేందుకు యువతకు ఓటే కీలకమని టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. మండలంలోని మహదేవపురం గ్రామంలో టీడీపీ సూపర్-6 పథకాలతో శనివారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రజలకు అందించబోయే సంక్షేమ పథకాలు, జరగబోయే అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, వెలుగోడు మహేష్, రామనాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివరామిరెడ్డి, చిన్న భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి

డోన్(రూరల్), మార్చి 9: మండలంలోని పలు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం ప్రారంభించారు. కొత్తకోట గ్రామంలో 20 ఎకరాల స్థలంలో రూ.20 కోట్లతో అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే ధర్మవరంలో రూ2 కోట్లతో నిర్మించిన రహదారిని, ఎద్దుపెంటలో కేడీసీసీ బ్యాంకు కొత్త బ్రాంచ్‌ను, అనుంపల్లె గ్రామంలో రూ.1.80 కోట్లతో నిర్మించిన రోడ్డును మంత్రి బుగ్గన ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీ చైర్మన్ ఎస్వీ విజయ మనోహరి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళా ఉద్యమకారిణికి సన్మానం

డోన్(రూరల్), మార్చి 9: మహిళా ఉద్యమకారిణి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మకు వినియోగదారుల రక్షణ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి సన్మానించారు. ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని సుగుణమ్మకు పూలమాలతో, శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల రక్షణ సంఘం నాయకులు ఏఈ నాగరాజు, సామాజిక సేవా కార్యకర్త మహ్మద్ రఫి, వంశీకృష్ణ, ఆలంకొండ బాషా, యేసు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



ప్రజలకు పథకాలు వివరిస్తున్న భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, మార్చి 9: రాష్ట్రంలోని పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శిరివెళ్లలోని 105, 106వ బూత్‌లలో శనివారం పర్యటించి టీడీపీ మినీ మ్యానిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో రైతులు, యువత, మహిళలు వైసీపీకి సరైన గుణపాఠం నేర్పాలని అన్నారు. వైసీపీ నాయకులు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబునాయుడును సీఎంగా చేసుకుంటేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీసీ ఖాజాహుసేన్, బీసీ ఫిదాహుసేన్, యామా గుర్రప్ప, సూరా రామ, అబుబకర్ సిద్ధిక్, బీఎండీ రఫి, ఉస్మాన్‌బాష, మహమ్మద్‌హుసేన్, బాలచంద్రుడు, ఉల్లి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ఆదుకుంటాం

తోపుడు బండ్లు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే బీసీ

బనగానపల్లె, మార్చి 9: పట్టణంలోని చిరు వ్యాపారులను ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బీసీ జనార్దన్‌రెడ్డి వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.25లక్షలతో 150 మంది చిరు వ్యాపారులకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి తోపుడు బండ్లను శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తోపుడు బండ్లపై జీవనం సాగిస్తున్న చిరువ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి తొలి విడతగా 150 తోపుడు బండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. చిరు వ్యాపారులు తోపుడు బండ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి విడతల వారీగా తోపుడు బండ్లు పంపిణీ చేస్తామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలను బీసీజెఆర్ ట్రస్ట్ తరఫున ఆదుకుంటా మన్నారు. చిరు వ్యాపారులు మాట్లాడుతూ తోపుడు బండ్లకు అద్దె రోజుకు రూ.50 చెల్లిస్తున్నామన్నారు. నెలకు సుమారు రూ2వేల వరకు తోపుడు బండ్లకు అద్దె చెల్లించి కుటుంబపోషణ సాగించాలంటే కష్టంగా ఉండేదన్నారు. ఒకరోజు వ్యాపారం జరుగుతుంది. మరోరోజు వ్యాపారం జరగదన్నారు. వ్యాపారం జరగకున్నా అద్దె చెల్లించాల్సిందేన్నారు. బీసీ జనార్దన్‌రెడ్డి తమ గురించి ఆలోచించి బీసీజెఆర్ ట్రస్ట్ తరఫున ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ రామనాథరెడ్డి, బురానుద్దీన్, అన్వర్‌సాహెబ్, కాశీంబాబు, సలాం నియాజ్, అల్తాఫ్ హుసేన్, గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, గడ్డం అమర్‌నాథ్‌రెడ్డి, మౌలీశ్వర్‌రెడ్డి, రజాక్, ఖైరాత్‌వలి, పూలకాశీం, గౌండాబాబు, అహమ్మద్‌హుసేన్ పాల్గొన్నారు.



తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బీసీజేఆర్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు : బీసీజేఆర్ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. కార్మికులు ప్రమాదవశాత్తూ చనిపోతే బీసీజేఆర్ ట్రస్ట్ ద్వారా రూ.లక్ష, ప్రమాదవశాత్తూ తీవ్ర గాయాలకు గురైతే రూ.20వేలు బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. గౌండా, పాలిష్ కట్టింగ్ పని చేసే కార్మికులు, కార్పెంటర్లు, పెయింటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఆటో, టాక్సీ డ్రైవర్లు, ఆటో మొబైల్ మెకానిక్‌లు, టైలర్లకు ఏదైనా ప్రమాదం జరిగితే బీసీజెఆర్ ట్రస్ట్ ద్వారా రూ.20 వేలు, ప్రమాదవశాత్తూ చనిపోతూ రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఆ వృత్తుల వారికి ట్రస్ట్ తరఫున ప్రత్యేకంగా కమిటీ సభ్యులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు మాధవరెడ్డి, 9177782305, దస్తగిరి 7680874408 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

టీడీపీతోనే మహిళల ఆర్థికాభివృద్ధి



డోన్ చిగురుమానుపేటలో పర్యటిస్తున్న కోట్ల నివేదిత

డోన్, మార్చి 9: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే మహిళల ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. శనివారం పట్టణంలోని 15వ వార్డులో ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఆమె పంపిణీ చేశారు. కోట్ల నివేదిత మాట్లాడుతూ వైసీపీ పాలనలో మహిళలపై దాడులు పెరిగిపోయాయన్నారు. సీఎం జగన్ మహిళల సంక్షేమాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి మోసం చేశారన్నారు. చంద్రబాబు హయాంలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, ఎరుకల చెర్వు శివ, టీఈ రాఘవేంద్రగౌడు, మర్రి మణి, మనోహర్, నూర్‌బాషా, రామాగౌడు, సుదర్శన్ గౌడు, అజీజ్, టీఈ శిరీష, రజిని, పాల్గొన్నారు.

కమనీయం.. శివ పార్వతుల కల్యాణం

డోన్(రూరల్), మార్చి 9: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణ సమీపంలోని కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం, పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో శివపార్వతుల కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కోట్రికే హరికిషన్, పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త బైసాని రాజు, నిర్వాహకులు పుల్లగూర నాగరాజు, బైసాని నరసింహయ్య ఆధ్వర్యంలో జరిగిన స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవంలో భక్తులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు.

ప్యాపిలి: మహాశివరాత్రి పండుగ సందర్భంగా శనివారం మండలంలోని పలు శివాలయాల్లో శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి, బండగేరి భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయాలతోపాటు మండలంలోని కాకనవరం, పెద్దపూదిళ్ల, ఊటకొండ , పంచలింగాల శివాలయాల్లో కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అలాగే పట్టణంలో భక్తులు శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు.

బేతంచెర్ల: మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని హెచ్. కొట్టాల గ్రామ సమీపంలో కొండల నడుమ వెలసిన ముచ్చట్ల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ సమేత కళ్యాణోత్సవాన్ని తెల్లవారుజామున కన్నుల పండువగా నిర్వహించారు. అలాగే ఎంబాయి గ్రామ శివారులో వెలసిన భోగేశ్వరంలో, పట్టణంలోని పూదోట మఠంలో శివపార్వతుల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రూపు దేవాలయాల ఈవో మద్దిలేటి, చైర్మన్ గుండా జగన్మోహన్‌రావు, పూదోట మఠం నిర్వాహకులు గుండా గోపాల్, సముద్రాల రామక్రిష్ణయ్య, ప్రసాద్, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామంలో శివరాత్రిని పురస్కరించుకొని శనివారం గ్రామంలోని రామేశ్వరస్వామి ఆలయం నుంచి పట్టణవీధుల్లో శివపార్వతుల విగ్రహాలను ఊరేగించారు. ఆలయ చైర్మన్ చల్లా మద్దిలేటి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు కర్ణాటక నుంచి వచ్చిన ప్రత్యేక కళాకారులతో నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అంబాల రామకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరం భాస్కర నందీశ్వర ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత అర్చకులు విశ్వనాద శర్మ శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణం కన్నులపండువగా కొనసాగింది. శనివారం శివపార్వతులను పల్లకీలో బోయీలు మోస్తూ మేళతాళాలతో పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

- రుద్రవరం మండలం వాసాపురంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత మానస లింగేశ్వరస్వామి త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు అర్చకులు వారణాసి గోపిశర్మ, శివశర్మ కల్యాణం నిర్వహించారు. మానస లింగేశ్వరస్వామి త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు పట్టువస్త్రాలతో అలంకరించారు.

చాగలమర్రి: చాగలమర్రి రామలింగేశ్వర ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా శనివారం శివపార్వతుల కల్యాణం కమణీయంగా సాగింది. వేద పండితుల ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి, రమణారెడ్డి, నారాయణ, నాగేంద్రప్రసాదు దంపతులచే శివపార్వతుల కల్యాణం చేశారు. అలాగే బుగ్గమల్లేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయాల అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, శివప్రసాదు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



పలుకూరులో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



ముచ్చట్లలో..



ప్యాపిలిలో శోభాయాత్రను నిర్వహిస్తున్న భక్తులు



చాగలమర్రి పాత శివాలయంలో నృత్యం చేస్తున్న చిన్నారులు



డోన్ పాతబుగ్గలో శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



చాగలమర్రి రామలింగేశ్వర ఆలయంలో..



రుద్రవరం మండలం వాసాపురంలో..



రుద్రవరంలో శివపార్వతుల గ్రామోత్సవం

వెంకటేశ్వరుడికి కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న భక్తులు

రుద్రవరం, మార్చి 9: మండలంలోని వాసాపురంలో వెంకటేశ్వర స్వామి లక్ష్మి గోదాదేవి అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారణాసి గోపిశర్మ వేద మంత్రోచ్చారణల మధ్య అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు

నరసింహస్వామి ఆలయాల్లో పూజలు: మండలంలోని నరసాపురం, రుద్రవరం నరసింహాస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో స్వామి అమ్మవార్లకు అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు.

సంతాన వేణుగోపాలుడికి.. రుద్రవరం మండలంలోని రుద్రవరం గ్రామంలో శనివారం సంతాన వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు నిత్య తృష్ణదాస్ అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు.

వైభవంగా పూర్ణాహుతి



మూడురాళ్లపల్లెలో హోమం చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, మార్చి 9: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో రూ.120 కోట్లతో నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, సాయిబాబా, గణపతి, వీరభద్రస్వామి నూతన ఆలయాల ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శనివారం వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో గణపతి, రుద్రాభిషేకం, పూర్ణాహుతి హోమాలను దాతలు, దంపతులచే నిర్వహించారు. ఆలయాల్లో విగ్రహాలు, ధ్వజస్తంభాలు ప్రతిష్ఠించి 21 రోజులు పూర్తి కావడంతో సంప్రోక్షణ కార్యక్రమం చేశారు.

రేపు మార్కెట్ వేలం

రుద్రవరం, మార్చి 9: రుద్రవరం మేజరు పంచాయతీలో ఈ నెల 11న వేలాలు నిర్వహిస్తున్నట్లు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వారపు సంత మార్కెట్, దిన మార్కెట్, కబేళా మార్కెట్లకు వేలాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దిన, సంత మార్కెట్లకు రూ.50వేలు డిపాజిట్ చెల్లించి, కబేళా మార్కెట్‌కు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో వేలందారులు పాల్గొనాలని ఈవో కోరారు.

టీడీపీ కార్యకర్తలకు పరామర్శ



టీడీపీ కార్యకర్త ప్రభాకర్‌ను పరామర్శిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, మార్చి 9: పట్టణంలోని బీసీ రాజారెడ్డి కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త ప్రభాకర్ అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్‌లో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని దరూర్ సుబ్రహ్మణ్యం డ్రైవర్‌గా పనిచేస్తూ పక్షపాతానికి గురై ఇంటికే పరిమితం కావడంతో ఆయనను పరామర్శించారు. ట్రైసైకిల్ కావాలని కోరగా వెంటనే వారం రోజుల్లో ట్రైసైకిల్ అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే విద్యుత్ కార్యాలయం సమీపంలో షేక్ భాను కుమారుడు ఇటీవల ప్రమాదానికి గురై చేయి విరిగిపోయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండడంతో ఆయనను పరామర్శించారు.

దైవమార్గంలో నడవండి



మసీదులో భోజనం చేస్తున్న ముస్లింలు

రుద్రవరం, మార్చి 9 : దైవమార్గంలో నడిచి పుణ్యఫలాలు పొందాలని ముస్లిం మత పెద్దలు బోధించారు. శనివారం రుద్రవరం జామియా మసీదులో ముస్లింలు సమైక్యంగా అల్లా మార్గంలో నడిచే అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు నాగులవరం, తువ్వపల్లె, కొండమాయపల్లె, రుద్రవరం, కొత్తపల్లె, కొత్తూరు, మాకినేనిపల్లె గ్రామాల నుంచి ముస్లింలు తరలివచ్చారు. ముస్లింలకు మసీదు ఆవరణలో భోజనాలు ఏర్పాటు చేశారు.

అన్నదానం ప్రారంభం

చాగలమర్రి, మార్చి 9: చాగలమర్రి గ్రామంలోని బసవన్న కట్ట బ్రహ్మంగారి మఠం వద్ద శనివారం మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షుడు పెద్ద నరసింహారెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, రామసుబ్బారెడ్డి ప్రారంభించారు. కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు



సూపర్-6 ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, మార్చి 9: రాష్ట్ర భవిష్యత్తు టీడీపీతోనే సాధ్యమని మాజీ సర్పంచ్ ఇండ్ల లక్ష్మిరెడ్డి, పాల డైరీ చైర్మన్ రమణారెడ్డి అన్నారు. శనివారం ముత్యాలపాడు గ్రామంలో టీడీపీ సూపర్-6 ఫ్లెక్సిని టీడీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో పత్రాలను అందజేశారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. జరగబోయే ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాష, బ్రహ్మానందరెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

దేవతావృక్షాన్ని కూల్చడం దుర్మార్గం: బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

డోన్(రూరల్), మార్చి 9: పట్టణంలోని పాతబస్టాండులో నూతన కూరగాయల మార్కెట్ షాపుల వద్ద ఉన్న దశాబ్దాల నాటి దేవతా వృక్షాన్ని తొలగించి తన జేజినాయన బుగ్గన శేషారెడ్డి విగ్రహం ఏర్పాటుకు రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పూనుకోవడం దుర్మార్గమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి మండిపడ్డారు. శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు నీడను ఇచ్చే చెట్టును నరికివేసి తన తాత విగ్రహం పెట్టాలనుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు దేవేంద్రుడు, ఆర్మీ రామయ్య, మేడసారి శివశంకర్, కోడి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

శెట్టివీడులో నీటి కష్టాలు

చాగలమర్రి, మార్చి 9: మండలంలోని శెట్టివీడు గ్రామంలో నీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో బోర్లు పని చేయకపోవడంతో కొళాయిలకు నీరు రాక ఇబ్బందులు పడుతున్నారు. బోర్లు మరమ్మతులు చేయకుండా నీటి సౌకర్యం కల్పించడం లేదని మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు నరసింహారెడ్డి వాపోయారు. సింగిల్‌ఫేస్ మోటార్లు ఏర్పాటు చేయడం లేదని, దీంతో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని అన్నారు.